క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పరవాడలో నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అచ్యుత రావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లతో కలిసి ఆయన గ్రామంలో బుధవారం పర్యటించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల వద్ద నిల్వనీటిని సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు సిరపరపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫొటోగ్రాఫర్ల సంయుక్త కార్యదర్శిగా శ్రీను



శ్రీనును అభినందిస్తున్న ఫొటోగ్రాఫర్లు

పరవాడ: మండల ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ కార్యదర్శి పైల శ్రీను రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్ల యూనియన్ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. స్థానిక మరిడిమాంబ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.లోవరాజు ఈ మేరకు ప్రకటించారు. సమావేశంలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు బి.వి.వి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి శంకరరావు, పరవాడ ఫొటోగ్రాఫర్ల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలపై స్పెషల్ డ్రైవ్



వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్న పరవాడ సీఐ ఈశ్వరరావు, సిబ్బంది

పరవాడ: పెండింగ్ చలానాలపై మండలంలోని ప్రధాన కూడళ్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అనకాపల్లి ఎస్పీ ఆదేశాల మేరకు పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, పోలీసు సిబ్బంది బుధవారం ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేసి, పెండింగ్ చలానాలను రాబట్టారు. సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ మీ సేవ, ఈ చలానా యాప్ ద్వారా నిర్ణీత గడువులోపు పెండింగ్ చలానాలు చెల్లించాలని వాహనచోదకులకు సూచించారు.

వర్షంపై రైతుల హర్షం

పరవాడ: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతాంగానికి ఊరటనిచ్చాయి. ఇటీవల కురిసిన తేలికపాటి వర్షాలకు వరి నారుమళ్లలో విత్తనాలు వేశారు. అవి మొలకెత్తనున్న దశలో వర్షాలు పడకపోవడంతో అవి విత్తుకోలేదు. ఈ తరుణంలో మంగళవారం నుంచి ప్రారంభమైన వర్షాలు రైతులకు ఉపశమనం కలిగించాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరి నారుమళ్లు, అపరాలు, గంటి, చోడి పంటలకు దోహదపడతాయని రైతులు భావిస్తున్నారు. మంగళవారం రాత్రి మండలంలో 5.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని మండల వ్యవసాయాధికారి సిహెచ్.చంద్రావతి చెప్పారు. బుధవారం ఉదయం వాతావరణం పొడిగా ఉండి, సాయంత్రం నుంచి వర్షం ప్రారంభమైంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

‘జగనన్న సురక్ష’తో అర్హులందరికీ లబ్ధి

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అడవివరంలో జరిగిన జగనన్న సురక్షలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. సాంకేతిక, లేదా ఇతర కారణాల వల్ల పథకాలు అందకుంటే, వారికి కూడా న్యాయం చేసేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. భీమిలి నియోజకవర్గ పరిధి 98వ వార్డులోని సచివాలయాలకు సంబంధించి స్థానిక పాత గోశాల జంక్షన్ సమీపంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా, పారదర్శకంగా, ఎలాంటి వివక్ష లేకుండా అర్హులందరికీ మన సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా సంక్షేమ ఫథకాలను అందిస్తూ.. దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు.

ఇతర రాష్ట్రాల్లోనూ అమలు

మన రాష్ట్రంలో అమలులో ఉన్న పథకాలు, పాలనా విధానాలు ఇతర రాష్ట్రాల్లోను అక్కడి ముఖ్యమంత్రులు అమలు చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సచివాలయ వ్యవస్థను చూసి తమిళనాడు రాష్ట్రంలో అక్కడి సీఎం స్టాలిన్ 600 సచివాలయాలు పెడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఇంటింటికీ వాహనాల ద్వారా రేషన్ అందించే వ్యవస్థను పంజాబ్ ముఖ్యమంత్రి భగవత్‌మాన్ అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను మిగిలిన రాష్ట్రాల వారంతా మెచ్చుకుంటున్నారన్నారు.

సీఎం జగన్‌ది చేయూతనిచ్చే వ్యక్తిత్వం

చంద్రబాబుకు, జగన్‌మోహన్‌రెడ్డికి చాలా తేడా ఉందన్నారు. చంద్రబాబుది మోసం చేసే వ్యక్తిత్వమని, జగన్‌మోహన్‌రెడ్డిది చేయూతనిచ్చే వ్యక్తిత్వమన్నారు. డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేశారన్నారు. సున్నా వడ్డీ చేస్తానని, రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి చేయలేదన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా ఇప్పటికి మూడుసార్లు ఇచ్చారని, ఇంకో విడత కూడా అందించడం జరుగుతుందన్నారు. వృద్ధాప్య పింఛన్లు కూడా రూ.3 వేలు చేయడం జరుగుతుందన్నారు. కరోనా సమయంలో కూడా ఏ పథకం ఆపలేదని, ప్రతీ ఒక్కరికీ సంక్షేమాన్ని అందించారన్నారు. ఇప్పటివరకు రెండు లక్షల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల ద్వారా అందించడం జరిగిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎలాంటి యూజర్ చార్జీలు లేకుండా 11 రకాల సర్టిఫికెట్లు అందించారన్నారు. ఈ సందర్భంగా 1480 మందికి సర్టిఫికెట్లు జారీ కాగా, పలువురికి ముత్తంశెట్టి సమావేశంలో వాటిని అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ 8వ జోన్ ఏపీడీ శ్రీరామ్, 98వ వార్డు జేసీఎస్ కన్వీనర్ లంక సత్తిబాబు, 98వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరం బాబు, అడవివరం కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ నాయకులు నడింపల్లి రామరాజు, ఎస్.కృష్ణ, దొంతల సంతోష్, తెడ్లపు మహేష్, టి.రాము, ఎన్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



98వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తుదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సింహాచలం: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చిన ఘనత మన సీఎందే అన్నారు. జీవీఎంసీ 98వ వార్డు పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని సచివాలయాలకు సంబంధించి పద్మావతి నగర్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు సుమారు 600కి పైగా హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక అన్నింటినీ మరిచారన్నారు. ప్రజలను మోసం చేశారన్నారు. కానీ, 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చుకుంటూ వచ్చారన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, డ్వాక్రా రుణమాఫీ, చేయూత, పింఛను నగదు పెంపు వంటివి అన్నీ అమలు చేశారన్నారు.

అందరికీ ఆర్థికంగా అండ

గతంలో పింఛను తీసుకోవాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్నారని చెప్పారు. రేషన్ వాహనాల ద్వారా రేషన్ సరఫరా చేస్తున్నారన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా పిల్లల ఉన్నత చదువులకు భరోసా కల్పిస్తున్నారన్నారు. ఆటో డ్రైవర్లు, రజకులు, నాయీబ్రాహ్మణులు తదితరులందరికీ ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులకు పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు అందించారన్నారు. అధికారుల చుట్టూ, నాయకుల చుట్టూ ఆయా సంక్షేమ పథకాల కోసం తిరగక్కరలేని పరిస్థితి కల్పించారన్నారు. ఎలాంటి లంచం ఇవ్వకుండాను, నిష్పక్షపాతంగా అందేలా చేశారన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అనేక సంక్షేమ పథకాలు పెడితే ఆయన తనయుడుగా జగన్‌మోహన్‌రెడ్డి వాటిని కొనసాగిస్తూ నాలుగేళ్ల పాలనలోనే మరిన్ని పథకాలు అందిస్తున్నారన్నారు.

వలంటీర్లపై అభాండాలు సరికాదు

ప్రజలకు సంక్షేమ పథకాలను చేరవేస్తూ.. సంక్షేమ వారధులుగా నిలుస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభాండాలను వేయడం దౌర్భాగ్యమన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమం పెట్టారన్నారు. అర్హులై ఉండి సర్టిఫికెట్లు లేని కారణంగా ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ఎలాంటి యూజర్ చార్జీలు లేకుండా 11 రకాల సర్టిఫికెట్లు జగనన్న సురక్ష ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 1135 మందికి సర్టిఫికెట్లు అందించారు. సమావేశంలో యూసీడీ ఏపీడీ శ్రీరామ్, జేసీఏ ఇన్‌చార్జి జోబ్‌దాస్, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, పార్టీ నాయకులు పీతల అప్పలరాజు, నడింపల్లి రామరాజు, పీతల విష్ణుమూర్తి, కె.సింహాద్రి, 94వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, పెందుర్తి మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ బల్ల రాంబాబు, దాసరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే ‘గడప గడపకు..’



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని తానాం గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కో కుటుంబానికి ఏ మేర లబ్ధి చేకూరిందో వివరించి, బుక్‌లెట్‌ను అందజేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు అరిజిల్లి దేవిరవి, గొల్లవిల్లి శ్రీనివాస్, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు డెక్క శ్రీనివాసరావు, పైల అప్పలనాయుడు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం పైడిరాజు, ట్రస్ట్ ప్రతినిధులు

సింహాచలం: ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు విద్యార్థులకు సూచించారు. అడవివరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ ఏకాగ్రత, శ్రద్ధతో పాటు నిర్దిష్ట ప్రణాళికతో చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు సూరెడ్డి బాబూరావు మాట్లాడుతూ సబ్జెక్టుతో పాటు అర్థమెటిక్, మెంటల్ ఎబిలిటీపై పట్టు సాధించి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు, మేనేజర్ సింగంపల్లి అర్జున, సభ్యులు, ఉపాధ్యాయుడు కె.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కుంభవృష్టి

భారీ వర్షానికి నీట మునిగిన ఐవోసీ సేవా మార్గం



వర్షానికి నీట మునిగిన ఐవోసీ మార్గం



జ్ఞానాపురం గెడ్డవీధిలో చేరిన వర్షపు నీరు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు తెరపు లేకుండా కురిసిన భారీ వర్షానికి పలు సేవా మార్గాలు నీటితో నిండిపోయాయి. కాలువలు, గెడ్డలు పొంగాయి. కొండవాలు ప్రాంతాల్లో మట్టి దిబ్బలు విరిగిపడ్డాయి. వర్షం భారీగా కురవటంతో వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. మల్కాపురం సమీపాన గల ఐవోసీ సేవా మార్గం పూర్తిగా నీట మునిగింది. ఇక్కడి గెడ్డలో నీరు పోయే మార్గం లేక సమీపంలోని సేవా మార్గం నీటితో నిండిపోయింది. ఆ మార్గాన ఐవోసీ టెర్మినల్ ప్లాంట్‌కు ఆయిల్ లోడింగ్‌కు వచ్చే లారీలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. లారీ చక్రాలు మునిగిపోయే స్థాయికి ఇక్కడ నీరు చేరింది. ఐవోసీలోకి కూడా నీరు చేరింది. హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థ విస్తరణ పనులు జరుగుతున్న ప్రదేశంలో వర్షం నీరు భారీగా చేరింది. దీంతో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మల్కాపురం సేవా మార్గం, నౌసేనా భాగ్, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో ఉన్న సేవా మార్గాల్లో నీరు నిలిచిపోయింది. 59వ వార్డు హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి మట్టి చరియలు విరిగిపడ్డాయి.

నీట మునిగిన వీధులు..

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం పలు వీధులు నీట మునిగాయి. ఎర్రిగెడ్డకు ఆనుకుని ఉన్న సెబాస్టియన్‌కాలనీ, బాబుకాలనీ, గెడ్డవీధి, రాచవీధి తదితర ప్రాంతాలు మూడడుగుల లోతు నీట మునిగాయి. ఇళ్ల నుంచి రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మురుగు రహదారుల్లో చేరడంతో వీధులు దుర్గంధభరితంగా మారాయి. జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ పర్యవేక్షించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ నేతృత్వంలో పారిశుధ్య సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

ఏయూ క్యాంపస్: ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైఎస్ మూర్తి ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏపీ ర్యాగింగ్ నిషేధ చట్టం 1997 గురించి విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే తీసుకునే చర్యలను తెలియజేశారు. అదే విధంగా యువత వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మోటారు వాహన చట్టాలు, తాజాగా వచ్చిన మార్పులు వివరించారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రాము మాట్లాడుతూ నగరంలో ర్యాగింగ్, మత్తు పదార్థాలకు సంబంధించి గతంలో నమోదైన కేసులు, పర్యవసానాలు వివరించారు. విద్యార్థులు వీటికి దూరంగా ఉంటూ తమ ఉన్నత భవిష్యత్‌ని పదిలం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య ఎ.ప్రసాద్, ఆచార్య ఎస్.పాల్ డగ్లస్, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝురి



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



ప్రధాన కలశాన్ని శిరసుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరి ఆధ్యాత్మిక సిరిని సంతరించుకుంది. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని నృసింహ హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించగా.. స్వామి నిత్య కల్యాణం కనులపండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహ హోమం

సింహగిరిపై బుధవారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున నృసింహ హోమం జరిపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణమండపంలో హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయం నుంచి తిరువీధి ఉత్సవంతో కల్యాణమండపం వద్దకు తీసుకొచ్చి, అక్కడున్న హోమగుండం వద్ద కొలువుదీర్చారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కలశారాధన, అగ్నికార్యం అనంతరం నృసింహ హోమం నిర్వహించారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలందరిచేత స్వామి వారి అష్టోత్తర నామావళిని పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శిరసుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కి సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. ఉభయదాతలకు దేవస్థానం తరఫున శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు అప్పాజీ తదితరులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్రపర్వం.. నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

నేర నియంత్రణకు సహకరించాలి



ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ నర్సింగరాజు

గోపాలపట్నం: విశాఖలో నేరాల నియంత్రణకు నగర పౌరులు సహకరించాలని గోపాలపట్నం క్రైమ్ ఎస్ఐ నర్సింగరాజు కోరారు. ఈ మేరకు గోపాలపట్నం పోలీస్ స్టేషన్లో ఆటో డ్రైవర్లు, స్థానిక యూనియన్ నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోల్లో ప్రయాణికులు మర్చిపోయినవి, వదిలేసిన వస్తువులు పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలని సూచించారు.

ఆటోల్లో ప్రయాణించే వారి వస్తువులు చోరీకి గురవడం వంటివి తరచూ జరుగుతున్నాయని తెలిపారు. అలాంటి వారిపై దృష్టి పెట్టాలన్నారు. ఆటో ఎక్కేవారు ఎక్కడికి వెళ్తున్నారు.. ఎక్కడ దిగుతున్నారన్న విషయాల్ని గమనించాలని తెలిపారు. జోన్–2 క్రైమ్ ఏసీపీ ఎస్.సునీల్ ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ సింహాద్రికి రాజభాష గౌరవం



అవార్డును అందుకుంటున్న ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్‌సిన్హా

పరవాడ(పెందుర్తి): అధికార భాష హిందీ అభివృద్ధికి విశేష కృషి చేసినందుకు టోలిక్(అండర్ టేకింగ్) సంస్థ ఎన్టీపీసీ సింహాద్రికి 2022–23 ఏడాదికి ‘రాజభాష గౌరవం సమ్మా’అవార్డును ప్రకటించింది. విశాఖ ఉక్కు నగరంలో నాగార్జున ఆడిటోరియంలో బుధవారం జరిగిన 13వ పట్టణ అధికార భాషా అమలు కమిటీ(టోలిక్) సమావేశంలో ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా, ప్రాజెక్ట్ హెచ్ఆర్ రుమాడీశర్మ ఈ అవార్డును అందుకున్నారు. ఎన్టీపీసీ సింహాద్రిలో రాజభాష అమలుకు గణనీయమైన కృషికి గుర్తింపుగా అఖిలేష్ త్రిపాఠి(ఎగ్జిక్యూటివ్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్) ప్రశంసా పత్రం, నగర్ రాజభాష సమ్మాన్‌తో సిన్హాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం టోలిక్(అండర్ టేకింగ్) చైర్మన్ అతుల్ భట్, అధికారిక భాషా విభాగం, హోం మంత్రిత్వశాఖ కార్యాలయ అధికారి అనిర్బన్ కుమార్ బిస్వాస్, టోలిక్ బృంద సభ్యులు, వివిధ కార్యాలయాల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై మాజీ సైనికులకు అవగాహన

కంచరపాలెం: కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో మాజీ సైనికులకు ప్రైవేటు ఆర్గనైజేషన్‌లో ఉపాధి–స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఉపాధి కార్యాలయ అధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వివిధ పరిశ్రమల్లో ఉపాధి పథకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ ట్రేడుల్లో అవకాశాలు, నైపుణ్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంఘాల సభ్యులు, పలు పరిశ్రమల అధికారులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు గడువు 31 వరకు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ–చెన్నై ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9, 10 తేదీల్లో జరిగే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపునకు ఈ నెల 31 వరకు గడువు పెంచారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశికలకు అపరాధ రుసుం లేకుండా, హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, ఉత్తరార్థ, ప్రవీణ పూర్వార్థ, ఉత్తరార్థ పరీక్షలకు రూ.10 అపరాధ రుసుంతో ఈ ఫీజులు చెల్లించవచ్చు. ఈ పరీక్షలకు భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌ను కేంద్రంగా ఎంపిక చేశారు. వివరాలకు ఫోన్ నంబర్లు 89856 47419, 89858 97419లలో సంప్రదించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి–భీమిలి అధ్యక్షుడు కె.ఎ స్.ఆర్.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 16.24 లక్షలు



హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీల లెక్కింపు నిర్వహించారు. 46 రోజులకు గాను అమ్మవారి దర్శనాలకు సంబంధించి రూ.16,24,024 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. టర్నర్ చౌల్ట్రీ దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి ఎస్. ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది షేక్ హజరుద్దీన్, లక్ష్మీనారాయణ, ఇందిర రాణి, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.